క్లుప్తంగా

తెలంగాణ ప్రజాశక్తి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా వెంకట్



వెంకట్‌ను సన్మానిస్తున్న నాయకులు

సదాశివపేట(సంగారెడ్డి): తెలంగాణ ప్రజాశక్తి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా సదాశివపేట పట్టణానికి చెందిన దొడ్ల వెంకట్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పట్టణ పరి ధిలోని సిద్దాపూర్ కాలనీలోని ఆ పార్టీ కార్యాలయంలో వెంకట్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజలను ఓటు వేసే యంత్రాలుగా బీఆర్ఎస్ మార్చిందని వాపోయారు. ఏ ఒక్క వర్గానికీ సరైన న్యాయం చేయకపోగా ప్రజాధనాన్ని వృథా చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా అవినీతి, అన్యాయాలే రా జ్యమేలుతున్నాయని, అభివృద్ధి జరగడం లేద ని అవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రజాశక్తి పార్టీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ కొత్త బస్వరాజ్ పాటిల్, రాష్ట్ర నా యకులు వెంకట్ రెడ్డి, కట్కం విరేష్‌గుప్తా, బ్ర హ్మాచారి, ఫయాజ్, విరేష్ పాటిల్ పాల్గొన్నారు.

గురుపౌర్ణమి ఉత్సవాలకు ఆహ్వానం



అడిషనల్ కలెక్టర్‌కు ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఆశ్రమ పీఠాధిపతి

సంగారెడ్డి టౌన్: జిల్లాలో ఆధ్యాత్మిక క్షేత్రమైన బర్దిపూర్ దత్తగిరి మహరాజ్ ఆశ్రమంలో వచ్చే నెల జులై 3న నిర్వహించే గురుపౌరమి ఉత్స వాల కరపత్రాలను మంగళవారం కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డితో కలిసి విడుదల చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ పీఠాధిపతి 108 వైరాగ్య శిఖామణి అవధూత గిరిమహారాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృత్యువాత

జహీరాబాద్ టౌన్: విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందిన సంఘటన మండలంలోని కొత్తూర్(బీ) గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు శివప్ప ఆవు గ్రామ సమీపంలో ట్రైడెంట్ చక్కెర కార్మాగారం వెనుకాల మేత మేస్తుండగా పక్కనే కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్ తీగలకు తాకడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడిక్కడే మృత్యువాత పడింది. ఆవు విలువ రూ.50 వేలు ఉంటుందని రైతు శివప్ప బోరుమన్నాడు. ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటు చేయనందునే తన ఆవు మృతి చెందిందని, ప్రభుత్వం నుంచి పరిహారం అందించాలని కోరాడు.

మినుము విత్తనాలు పంపిణీ



విత్తనాలు అందజేస్తున్న అధికారులు

న్యాల్‌కల్(జహీరాబాద్): రైతులు అధిక దిగుబడులు ఇచ్చే పంటలను సాగు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి లావణ్య సూచించారు. మంగళవారం మండల పరిధిలోని ముంగి గ్రామంలో రైతులకు మినుము విత్తనాలను అందజేశారు. కార్యక్రమంలో ఏఈఓ షరీఫ్, రైతులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం ప్రారంభం

నారాయణఖేడ్: ఆర్టీసీ డిపోలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని నాగల్‌గిద్ద మండలం మోర్గి ప్రభుత్వ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ రమేష్, డీఎం మల్లేశయ్య మంగళవారం ప్రారంభించారు. పాఠశాల ఉపాధ్యాయులు, 20మంది ఆర్టీసీ సిబ్బంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి ప్రతిఒక్కరూ సాయం చేయాలన్నారు. స్థానిక ప్రాంతీయ ఆస్పత్రి ల్యాబ్ ఇన్‌చార్జీలు రాజేష్, సత్యం, సిబ్బంది లత, స్నేహ రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో పీఆర్ఓ పాండు, సిబ్బంది శివశంకర్, భాస్కర్, సాయిలు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న దాతలు

కోర్టు ఆదేశాలు బేఖాతరు

- నిబంధనలకు విరుద్ధంగా గ్రామకంఠం స్థలం నుంచే రోడ్డు
- పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తుల డిమాండ్



పరిశ్రమ గేట్‌కు అడ్డంగా కట్టెలు, మొద్దులు వేసిన గ్రామస్తులు

జిన్నారం(పటాన్‌చెరు): గ్రామకంఠం అనే బోర్డును అధికారులు ఏర్పాటు చేసినా ఓ పరిశ్రమ యాజమాన్యం లెక్కచేయకుండా ఆ స్థలం నుంచే రోడ్డును వేయించటం వివాదాస్పదంగా మారింది. జిన్నారం మండలంలోని గడ్డపోతారం పంచాయతీ పరిధిలోని అల్లీనగర్ గ్రామంలోని గ్రామకంఠం స్థలం నుంచి రోడ్డును వేసేందుకు ఓ పరిశ్రమ యాజమాన్యం యత్నించింది. గ్రామకంఠం స్థలాన్ని గ్రామ అవసరాలకే ఉపయోగించాలని, గ్రామస్తులు డిమాండ్ చేస్తూ పలుమార్లు ఆందోళనలు నిర్వహించగా స్పందించిన గ్రామ పంచాయతీ అధికారులు సూచిక బోర్డును సైతం ఏర్పాటు చేశారు. అయినప్పటికీ బోర్డు ఏర్పాటును లెక్కచేయకుండా పరిశ్రమ యాజమాన్యం గ్రామకంఠం స్థలం నుంచే వాహనాల రాకపోకలను చేపట్టింది. దీంతో గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ మంగళవారం వాహనాల రాకపోకలను అడ్డుకుని గేటు ఎదుట కట్టెలను వేసి పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు జగన్ మాట్లాడుతూ గ్రామకంఠం స్థలం విషయమై ఇదివరకు గ్రామస్తులతో కలిసి కోర్టులను ఆశ్రయించగా ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులకు, పోలీసులకు కోర్టు నుంచి నోటీసులు సైతం అందాయని గుర్తు చేశారు.



తొలకరి వర్షాలతో ఉపశమనం

సదాశివపేట(సంగారెడ్డి): నైరుతీ రుతుపవనాల ప్రభావంతో గత రెండు మూడు రోజులుగా ఉమ్మడి మెదక్ జిల్లాలోని వివిధ మండలాలు పట్టణాల్లో వర్షాలు కురుస్తున్నాయి. రెండు నెలలుగా భానుడి దాటికి ప్రజలు విలవిల్లాడిపోయారు. నైరుతి రుతుపవనాలు ఆలస్యం కావడంతో 25 రోజులుగా ఎన్నడూ లేనివిధంగా ఎండలు మండిపోయాయి. మూడు వారాల పాటు ఉక్కపోతతో ప్రజలు అల్లాడారు. ఆ క్రమంలో మూడు రోజులుగా సాయంత్రం అయ్యేసరికి ఒక్కసారిగా ఆకాశం నల్లటి మబ్బులతో మేఘావృతమై చల్లటి గాలులు వీయడంతో పాటు తేలికపాటి తొలకరి జల్లులకు వాతావరణం చల్లబడింది. దీంతో ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు వర్షాల రాకతో ఉపశమనం పొందుతున్నారు. వరుసగా కురుస్తున్న వర్షాలకు వాతావరణం ఆహ్లాదకరంగా మారింది. మరో వారం పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ అంచనా వేస్తోంది.

ఎన్ఎంఆర్ సేవలను విస్తరిస్తాం

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నీలం మధు



నీలం మధుకు స్వాగతం పలుకుతున్న యువకులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఎన్ఎంఆర్ సేవలను విస్తరిస్తామని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నీలం మధు అన్నారు. మంగళవారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదులనాగులపల్లిలో ఎన్ఎంఆర్ యువసేన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ ప్రజా సేవే లక్ష్యంగా ఎన్ఎంఆర్ యువసేన ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలను చేపడుతున్నట్టు తెలిపారు. అదేవిధంగా సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి వివరిస్తామన్నారు. నియోజకవర్గ ప్రజలు తనకు సహకరిస్తూ అండగా ఉంటే మంత్రులు కేటీఆర్, హరీష్‌రావుల ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శంకర్ చారి, లింగం, మధు, నారాయణ చారి, సుదర్శన్, మధుసూదన్ పాల్గొన్నారు.

ప్రతిభను వెలికితీసేందుకే క్విజ్ పోటీలు



పటాన్‌చెరు టౌన్: క్విజ్ పోటీలను పరిశీలిస్తున్న ఎంఈఓ రాథోడ్



సదాశివపేట పట్టణంలో..

పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభను వెలికి తీసేందుకు క్విజ్ పోటీలు ఎంతో ఉపయోగపడతాయని మండల ఎంఈఓ రాథోడ్ అన్నారు. పట్టణంలోని బాలికల ప్రభుత్వ పాఠశాలలో ఆర్బీఐ ఆధ్వర్యంలో యూనియన్ బ్యాంకు నిర్వహించిన ఇండియా ఫైనాన్షియల్ లిటరసీ క్విజ్ పోటీలను నోడల్ అధికారిగా ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పటాన్‌చెరు మండల పరిధి నుంచి పది ఉన్నత పాఠశాలల నుంచి 20 మంది విద్యార్థులు పోటీపడ్డారన్నారు. ఇందులో ప్రథమ స్థానంలో ఇస్నాపూర్ జెడ్పీహెచ్ఎస్ నుంచి అనూష శ్రావణి, ద్వితీయ స్థానంలో భానూర్ జడ్పీహెచ్ఎస్ నుంచి నాగశ్రీ, మహ్మద్ మస్తాన్, తృతీయ స్థానంలో పటాన్‌చెరు బాలికోన్నత పాఠశాలకు చెందిన భవాని, అంజలి నిలిచారన్నారు. ప్రథమ స్థానంలో నిలిచినవారికి రూ.5 వేలు, ద్వితీయం రూ.4 వేలు, తృతీయం రూ.3 వేలు చొప్పున వారి ఖాతాల్లోకి నేరుగా నగదును జమ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్పందన, ఉపాధ్యాయిని సుధారాణి, జాయింట్ మండల లెవల్ బ్యాంకర్ కమిటీ కన్వీనర్ విమలకృష్ణ పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై మండల స్థాయి క్విజ్ పోటీలు

సదాశివపేట(సంగారెడ్డి): మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మండల స్థాయి క్విజ్ పోటీలు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ దండు అంజయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల పరిధిలోని 13 పాఠశాల్లోని విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యత క్విజ్ పోటీల్లో పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై జాతీయ రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. క్విజ్ పోటీల్లో నందికంది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రథమ బహుమతి, ప్రభుత్వ పాఠశాల సదాశివపేటకు ద్వితీయ బహుమతి, ఆరూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు తృతీయ బహుమతి సాధించారు. కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయలు విద్యార్థులు పాల్గొన్నారు.

పండరిపూర్‌కు ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

మనూరు(నారాయణఖేడ్): సీఎం కేసీఆర్ మహారాష్ట్రలోని పండరిపూర్ యాత్రలో భాగంగా ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి వెంట మనూరు మండలం బోరంచ గ్రామానికి చెందిన పలువురు యువకులు ఆయనతో కలిసి వెళ్లారు. గ్రామానికి చెందిన స్ట్రీట్‌చిల్డ్రన్ ఫౌండేషన్ అధ్యక్షుడు రాజేశ్, నాయకులు మోహన్, ప్రేమ్ కుమార్, ఈషాపటేల్, అనిల్‌మౌర్య పాల్గొన్నారు.



ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డితో బోరంచ యువకులు

వేతనాలు చెల్లించాలని కార్మికుల నిరసన

జహీరాబాద్ టౌన్: వేతనాలు చెల్లించాలని ట్రైడెంట్ కర్మాగారం కార్మికులు మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కర్మాగారం గేటు వద్ద యాజమాన్యాన్ని వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం పలువురు కార్మికులు మాట్లాడుతూ నాలుగు నెలల వేతనాలు రావల్సి ఉండగా చెల్లించకుండా కాలయాపన చేస్తుందని వాపోయారు. ట్రైడెంట్ కర్మాగారంలో క్రషింగ్ ముగిసిన తరువాత నుంచి ఇంతవరకూ జీతాలు లేవన్నారు. జీతాలు చెల్లించకుండా కర్మాగారానికి తాళాలు వేశారని వాపోయారు. నాలుగు నెలల నుంచి జీతాలు లేక కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తమకు రావల్సిన వేతనాలు చెల్లించేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

'వీరశైవ లింగాయత్‌లది ఒకటే ధర్మం'

కొండాపూర్(సంగారెడ్డి): వీరశైవులు, లింగాయత్‌లది ఒకటే ధర్మమని శ్రీశైలం సూర్య సింహానాదీశ్వర జగద్గురు అన్నారు. మంగళవారం కొండాపూర్ మండల పరిధిలోని మల్కాపూర్‌లో ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జగద్గురు పంచాచార్య యాగమానోత్సవ మహాత్మ బసవేశ్వర జయంతిని నిర్వహించారు. కార్యక్రమానికి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు నిర్మలాజగ్గారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, తెలంగాణ చేనేత కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్, వివిధ సంఘాల వీరశైవ నాయకులు పాల్గొన్నారు.

జగదీశ్వర్‌స్వామికి పురోహిత రత్న అవార్డు



కోహీర్(జహీరాబాద్): మండలంలోని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బడంపేట రాచన్నస్వామి ఆలయ ప్రధాన పూజారి మడపతి జగదీశ్వర్ స్వామికి వీరశైవ పురోహిత రత్న అవార్డు వరించింది. శ్రీ ఆది జగద్గురు పంచాచార్య యుగమానోత్సవం, మహాత్మా బసవేశ్వర జయంత్యోత్సవాన్ని పురస్కరించుకొని సంగారెడ్డి గోకుల్ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో శ్రీమద్ 1008 జగద్గురు మహాస్వాములు జగదీశ్వర్ స్వామికి అవార్డును బహూకరించారు. అవార్డు లభించడంపై జగదీశ్వర్ స్వామి హర్షం వ్యక్తం చేశారు.

జనుము విత్తనాలతో లాభాలు



జనుము విత్తనాలను పంపిణీ చేస్తున్న చింతా ప్రభాకర్

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): సబ్సిడీపై అందజేస్తున్న జనుము విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర చేనేత సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్ తెలిపారు. మండల పరిధిలోని నందికంది సొసైటీలో మంగళవారం రైతులకు జనుము విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సంప్రదాయ పంటలకు స్వస్తి పలికి ఆధునిక పద్ధతుల్లో సాగుచేసి అధిక లాభాలు పొందాలని సూచించారు. జనుము విత్తనాల సాగుతో భూసారం పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ తొంట యాదమ్మ, పీఏసీఎస్ చైర్మన్లు మనోహర్‌రెడ్డి, రత్నాకర్‌రెడ్డి, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి, సర్పంచులు కుండెన రాజు, కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు అంజన్న, నాయకులు సుదీర్‌రెడ్డి, ప్యాట శ్రీనివాస్, విజయ్ భాస్కర్‌రెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను నియమించండి

మనూరు(నారాయణఖేడ్): మండల పరిదిలోని అతిమ్యాల్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించాలని స్థానిక సర్పంచ్ అంబిక నర్సింహులు అన్నారు. ఈ మేరకు విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి మంగళవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ కొంతకాలంగా ఉపాధ్యాయుల కొరత ఉండటంతో పిల్లలు నష్టపోతున్నారన్నారు. అధికారులు స్పందించి ఉపాధ్యాయులను నియమించేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

కల్లుగీత కార్మిక సంఘం సభలను జయప్రదం చేయాలి

సంగారెడ్డి టౌన్: కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్రస్థాయి చైతన్య సభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆశన్నగౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం కల్లుగీత కార్మిక సంఘం సంగారెడ్డి జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని సంగారెడ్డిలోని ప్రజాసంఘాల కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్లుగీత కార్మికుల అభివృద్ధికి భవిష్యత్ కార్యాచరణ రూపొందించడం కోసం ఈ నెల 29, 30 తేదీల్లో జనగామ పట్టణంలో నిర్వహించనున్న కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్రస్థాయి చైతన్య సభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సంఘంజిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌గౌడ్, ఉపాధ్యక్షుడు జంగన్నగౌడ్, జిల్లా కార్యదర్శి ప్రసాద్‌గౌడ్, జిల్లా కమిటీ సభ్యులు రాములుగౌడ్, నాగరాజుగౌడ్, కుమార్‌గౌడ్, సత్యనారాయణగౌడ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **కాంగ్రెస్‌లో చేరికలు**



మనూరు (నారాయణఖేడ్): నాగల్‌గిద్ద మండల పరిధిలోని వల్లూరు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ సంజీవరెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి సమక్షంలో మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. గ్రామ యువ నాయకులు, మాజీ ఎంపీటీసీ అంజిరెడ్డి, ఉపసర్పంచ్ షాకీర్, ఇద్దరు వార్డుసభ్యులు 40కుటుంబాలకు చెందిన 200మంది పార్టీలో చేరగా వారికి సంజీవరెడ్డి కండువాలు వేసి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. అనంతరం గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు.

◆ **బీజేపీ శిక్షణశిబిరంలో ఖేడ్ నాయకులు**

నారాయణఖేడ్: మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో మేరా బూత్.. సబ్‌సే మజ్బూత్ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న శిక్షణా శిబిరానికి నారాయణఖేడ్‌కు చెందిన బీజేపీ సీనియర్ నాయకులు శ్రీనివాస్, సతీష్, శరణప్ప, హన్మంతు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారని తెలిపారు. ఖేడ్ నియోజకవర్గంలోబీజేపీని పటిష్టం చేసేందుకు కృషిచేస్తామన్నారు.

◆ **రోబోయే ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయం**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రోబోయే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ గెలుపు ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గోదావరి అంజిరెడ్డి అన్నారు. మంగళవారం రామచంద్రాపురం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మేరా బూత్ సబ్‌సే మజ్‌బూత్ కార్యక్రమాన్ని టీవీలో వీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణలో బీజేపీ ఒక శక్తివంతంగా తయారైందన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజు, పెంటారెడ్డి, కృష్ణారెడ్డి, రాములు యాదవ్, బసమ్మ, జగన్‌గౌడ్ పాల్గొన్నారు.

◆ **విద్యార్థులకు పలకలు పంపిణీ**



ఝరాసంగం(జహీరాబాద్): హెల్పింగ్ హాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా పలకలు, విద్యా సామాగ్రిని మంగళవారం ఝరాసంగం ప్రాథమిక పాఠశాలలో ఆ సంస్థ చైర్మన్ జైపాల్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ మండల కో ఆర్డినేటర్ నర్సింలు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రత్నయ్య, ఉపాధ్యాయులు తుక్కప్ప, సంగీత, సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

◆ **బడీడు పిల్లలను పాఠశాలకు పంపించాలి**

ఝరాసంగం(జహీరాబాద్): బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వినయపాటిల్ అన్నారు. మండల పరిధిలోని బొప్పన్పల్లి గ్రామ శివారులో వలస వచ్చి జీవనం సాగిస్తున్న కుటుంబాల్లో చదువుకోకుండా ఉన్న విద్యార్థులను గుర్తించి మంగళవారం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వలస వచ్చిన వారి కుటుంబాల్లో ఐదు సంవత్సరాల పైబడిన వారిని గుర్తించి, వారి తల్లిదండ్రులకు చదువు ప్రాధాన్యతను వివరిస్తున్నామని తెలిపారు.

◆ **డ్రగ్ పరిశ్రమల్లో కార్మిక చట్టాలు వర్తింపజేయాలి**

కొండాపూర్(సంగారెడ్డి): బొల్లారం, కాజీపల్లి, గడ్డిపోతారం, బొంతపల్లిలో ఉన్న మైలాన్, హెటీరో డ్రగ్ పరిశ్రమల కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, అలాగే కార్మిక చట్టాలు వర్తింపజేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాజయ్య డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లో డీసీఎల్ రవీందర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు.

దాతల కృషి అభినందనీయం



విద్యా సామాగ్రిని చూపుతున్న విద్యార్థులు

నారాయణఖేడ్: ప్రభుత్వ పాఠశాలలో చదివే బడుగు, బలహీన వర్గాల పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని ర్యాకల్ పాఠశాల హెచ్ఎం చంద్రశేఖర్ ఆచార్య తెలిపారు. ఖేడ్‌కు చెందిన చిన్నపిల్లల డాక్టర్, లయన్స్‌క్లబ్ సభ్యులు నారాయణ సతీమణి డాక్టర్ అరుణ పుట్టిన రోజును పురస్కరించుకొని మంగళవారం ర్యాకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రూ.10వేలు విలువచేసే నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లతో పాటు ఇతర విద్యా సామాగ్రిని పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ అరుణ మాట్లాడుతూ పేద విద్యార్థులను చదువులో మరింత ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ సహాయం అందజేసినట్టు కార్యక్రమంలో ఉపాధ్యాయులు హన్మండ్లు, నర్సింహులు, దత్తు, లక్ష్మణ్, పాండు, భూమయ్య పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): డివిజన్ అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని కార్పొరేటర్ పుష్పనగేష్ తెలిపారు. మంగళవారం డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్ కాలనీ వార్డు కార్యాలయం, సోమేశ్వర ఆలయం వద్ద డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారానికి లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.